# నమస్తే తెలంగాణ
# వికారాబాద్

I | హైదరాబాద్, ఆదివారం 17 నవంబర్ 2024 | VIKARABAD




బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ కలిశారు. శనివారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను కల్వకుర్తి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులతో ఆయన మర్యాద పూర్వకంగా కలిసి.. ఈ నెల 27న జరుగనున్న తన కుమారుడి వివాహానికి ఆహ్వానించారు.

- కడ్తాల్, నవంబర్ 16

## ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

### వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, నవంబర్16 : పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ జిల్లాలో గ్రూప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్‌సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, అదనపు ఎస్పీ రవీందర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖల అధికారులు, పరిశీలకులు, రూట్ అధికారులు, ఐడెంటిఫికేషన్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-3 పరీక్షల కోసం జిల్లాలోని 31 కేంద్రాలు, వాటికి కావాల్సిన సౌకర్యాలపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలన్నారు. మొబైల్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి 8:30 గంటలకు అనుమతించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, అబ్జర్వర్ డాక్టర్ శ్రీధర్, రీజియన్ కో- ఆర్డినేటర్ డాక్టర్ నరేందర్ రెడ్డి చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



## బోటు షికారు..

### కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల సందడి

ధారూరు, నవంబర్ 16; ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద శనివారం పర్యాటకుల సందడి నెలకొన్నది. వీకెండ్ కావడంతో మండల పరిధిలోని వివిధ గ్రామాలతో పాటు ఇతర జిల్లాల నుంచి భారీగా తరలి వచ్చారు. బంధువులు, స్నేహితులతో కలిసి ప్రాజెక్టులో సరదాగా బోటింగ్ చేశారు. వన భోజనాలు చేసి సాయంత్రం వరకు సంతోషంగా గడిపి వెళ్లిపోయారు.

### రూ. కోటి ఇచ్చినా భూములను ఇవ్వం..



ప్రభుత్వం భూమికి రూ. కోటి ఇస్తామన్నా మా భూములను ఇచ్చేది లేదు. ఉన్న భూమి పోతే ఏం తినాలి, ఎలా బతకాలి. ఇచ్చిన పైసలు ఖర్చు అయితే ఎలా జీవించాలి. ఫార్మా కంపెనీలతో ఉద్యోగాలు అంటున్నారు. ఉద్యోగాలు చేసేందుకు మేము చదువుకోలేదు. ఆ ఉద్యోగం ఎన్ని రోజులు ఉంటుంది. భూమి అయితే బతికినంత కాలం ఉంటుంది. భూమి పోతే.. మా ప్రాణాలు పోతాయి.

– లక్ష్మీబాయి, రోటిబండతండా, దుద్యాల మండలం

### భయం భయంగా బతుకుతున్నాం.



ఘటన జరిగిన రోజు నుంచీ తండాలో ప్రతి ఒక్కరం భయం భయంగా బతుకుతున్నాం. కూరగాయలు, సరుకులు తెచ్చుకునేందుకు కూడా బయటికి వెళ్లడం లేదు. ఇంట్లో ఉన్నదే తింటున్నాం. తండాను విడిచి ఉండలేక ఇక్కడే ఇండ్లను కట్టుకున్నాం. భూములు పోతే ఎలా బతకాలి. మా భూములపైనే ప్రభుత్వానికి ఎందుకు కన్నుపడింది. మా బాధలను సీఎం అర్థం చేసుకోవాలి.

–అంబిక, రోటిబండతండా, దుద్యాల మండలం




నిర్మానుష్యంగా పులిచెర్లకుంట తండా

**ఘటన జరిగి వారం రోజులైనా.. ఇంకా భయం గుప్పిట్లోనే..**

**నిర్మానుష్యంగా మారిన ఫార్మా పల్లెలు**

**పోలీసుల భయంతో ఊర్లు వదిలివెళ్లిన గిరిజన రైతులు**

**కేవలం మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలే..**

**బయటికి వెళ్లలేక కారం, రొట్టెలతోనే వెళ్లదీస్తున్న వృద్ధులు**

**కొత్త వాళ్లు కనిపిస్తే.. ఆందోళన..**

**పైసలొద్దు.. ఉద్యోగమూ వద్దు..**

**ఏమి జరిగినా భూములు ఇవ్వబోమని స్పష్టం చేస్తున్న వృద్ధులు, మహిళలు**

# కోలుకోని లగచర్ల

*లగచర్ల ఘటన జరిగి వారం రోజులు గడుస్తున్నా ఫార్మా బాధిత గ్రామాలు, తండాల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ఎప్పుడు ఎటువంటి ఘటనను ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న భయంలో ఉన్నారు. రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. సోమవారం రాత్రి పోలీసులు వ్యవహరించిన తీరుతో ఇండ్లకు తాళాలు వేసి గ్రామాలను వదిలి వెళ్లిన రైతులు, యువకులు ఇంకా తిరిగి రాకపోవడంతో తండాలు నిర్మానుష్యంగా మారాయి. కేవలం మహిళలు, వృద్ధులు, చిన్నారులు మాత్రమే ఇండ్లలో ఉన్నారు. కాగా లగచర్ల ఘటనకు సంబంధించి అరెస్టుల పర్వం ఇంకా సాగుతున్నది.*

*-వికారాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ)/కొడంగల్*

లగచర్ల ఘటన జరిగిన నాటి నుంచి ఎవరితో ఏం మాట్లాడితే ఏం ముంచుకొస్తుందోనన్న భయంతో ఫార్మా బాధిత గ్రామాల ప్రజలు ఉన్నారు. కొత్తగా ఎవరైనా కనిపిస్తే అనుమానిస్తూ ఆందోళన చెందుతున్నారు. పోలీసులు ఎప్పుడొచ్చి ఏమి చేస్తారో.. ఎవరినీ తీసుకెళ్తారోనన్న గుబులు నెలకొన్నది. గ్రామాలను వదిలి వెళ్లిన రైతులు, యువకులు ఇంకా తిరిగి ఇండ్లకు రాకపోవడంతో తండాలు నిర్మానుష్యంగా మారాయి. ప్రస్తుతం అక్కడ మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలే కనిపిస్తున్నారు. పుట్టిన నాటి నుంచి తండాల్లోనే జీవిస్తున్నామని.. ఇటువంటి దారుణాన్ని ఎప్పుడూ చూడలేదని వృద్ధులు పేర్కొంటున్నారు. ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం తమ భూములు ఇవ్వాలని తెలిసిన నాటి నుంచి నిద్రలేని రాత్రులను గడుపుతున్నామని మహిళలు, వృద్ధులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తండాలను వదిలి బయటికి వెళ్లలేక.. ఇంట్లో ఉన్న కారం, రొట్టెలతోనే కాలం వెళ్లదీస్తున్నామన్నారు. ఏనాడూ.. ఎవరినీ ఇది కావాలని అడగలేదని.. ఉన్న దాంతోనే జీవిస్తుండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మా కడుపుకొట్టే ప్రయత్నం చేస్తున్నదని మండిపడుతున్నారు. పోలీసులు తీసుకెళ్లిన వారు ఏ విధంగా ఉన్నారో.. ఏం తింటున్నారోనని బాధపడుతున్నారు. తాతల కాలం నుంచి భూముల ఆధారంగానే బతుకు బండిని నెట్టుకొస్తున్నామని.. ఆ భూములను సర్కారు తీసుకుంటే మాకు చావే శరణ్యమని స్పష్టం చేస్తున్నారు. భూముల్లేకుంటే మాకు జీవితమే లేదన్నారు. భూములను తీసుకుని సర్కారు రూ. పది లక్షల రూపాయలు, ఉద్యోగం ఇస్తే అవి ఎన్ని రోజులు ఉంటాయని ప్రశ్నిస్తు న్నారు. భూమి ఉంటే తరతరాలు జీవించొచ్చని పేర్కొంటున్నారు.

### పది నెలలుగా తిండి, నిద్ర లేదు..



భూములు పోతాయని తెలిసిన నాటి నుంచి తిండి లేదు, నిద్ర లేదు. దాదాపుగా 10 నెలలుగా ఇదే జరుగుతున్నది. మాకు ఐదెకరాల పొలం ఉన్నది. అందులో రెండెకరాలు ప్రభుత్వం ఇచ్చినది కాగా.. మూడు ఎకరాలను కష్టపడి కొన్నాం. ప్రభుత్వం మొత్తం భూమిని తీసుకుంటామంటే ఎలా జీవించాలి. మొన్నటికి మొన్న రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డి వచ్చి భూములను తీసుకుంటామన్నారు. మా భూములను తీసుకుంటామంటే ఎలా..?

–సోనీబాయి, రోటిబండతండా, దుద్యాల మండలం

### ఏం జరిగినా.. మా భూములు ఇవ్వం..



ప్రభుత్వం ఎన్ని బాధలు పెట్టినా భూములు ఇచ్చే ప్రసక్తే లేదు. మాకు ఏడెకరాల పొలం ఉన్నది. మొత్తంగా ఫార్మావిలేజ్‌లో పోతుంది. ఈ మధ్య కాలంలోనే మా మామయ్య పొలంలో గడ్డి కోస్తూ..విద్యుదాఘాతంతో మృతి చెందారు. ఇప్పటి వరకు ఏ అధికారీ, ప్రభుత్వం వచ్చి కుటుంబాన్ని ఆదుకోలేదు. అలాంటప్పుడు మా భూములను ఎందుకు ఇవ్వాలి. ఆ పొలాలు పోతే మా బతుకు ఎట్ల.. ఉద్యోగం, పైసలు మాకు వద్దే..వద్దు.

–జ్యోతి, రోటిబండతండా, దుద్యాల మండలం



పులిచెర్లకుంట తండాలో ఇంటికి తాళం

### భూమి లేకుంటే జీవితమే లేదు..



నాకు ఐదుగురు కొడుకులు, ఐదెకరాల పొలం ఉన్నది. పంటలు పండించుకోవాల న్న ఉద్దేశంతో ఏకంగా పొలంలో 25 బోర్లు వేయగా.. ఒక్క బోరు మాత్రమే పడింది. భూమిని నమ్ముకున్నాం కాబట్టే అప్పులయినా.. అన్ని బోర్లు వేయించాం. భూమి లేకుంటే జీవనాధారమే లేదు. అలాంటి భూమి ప్రభుత్వం తీసుకుంటామంటే ఎలా ఇస్తాం. ఇచ్చే ప్రసక్తేలేదు.

– లక్ష్మీబాయి, రోటిబండతండా, దుద్యాల మండలం

### ఇందిరమ్మ ఇచ్చింది.. రేవంత్‌రెడ్డి దోసుకుంటుండు..



గతంలో ఇందిరమ్మ బతుకుమని భూమిని ఇచ్చింది. ఇప్పుడేమో రేవంత్‌రెడ్డి ఆ భూమిని దోసుకోవాలని చూస్తుండు. ఆ భూమి పోతే తండాను విడిచి వేరే ప్రాంతానికి వలస వెళ్లాల్సిందే. వృద్ధాప్యంలో ఆ తిప్పలు పడలేము..? ఈ ప్రాంతం బాగు పడుతుందని రేవంత్‌రెడ్డిని గెలిపిస్తే.. మా నోట్లో మట్టి కొట్టాలని చూస్తున్నాడు. సీఎం సారూ.. మా తిప్పలు తెలుసుకొని మా భూముల జోలికి రావొద్దు..

– పత్లావత్ లక్ష్మీబాయి, రోటిబండ తండా, దుద్యాల మండలం



## మందకొడిగా..

### రంగారెడ్డి జిల్లాలో నత్తనడకన సాగుతున్న ధాన్యం కొనుగోలు

*జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. వరి కోతలు పూర్తి అయ్యేందుకు వచ్చినా ఇంకా ఊపందుకోవడం లేదు. ప్రభుత్వం రైతుల నుంచి వడ్లను కొనేందుకు 29 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే పలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో అనుకున్న టార్గెట్ రీచ్ అయ్యేలా కనిపించడం లేదు. పౌరసరఫరా శాఖ ఆధ్వర్యంలో 80,000 టన్నుల ధాన్యాన్ని కొనాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు కేవలం 248 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. చాలామంది రైతులు దళారులకు తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో 1,38,000 ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేయగా.. 8,40,000 మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు.*

*- రంగారెడ్డి, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ)*

జిల్లాలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో 80,000 (50,000 టన్నుల సన్న, 30,000 టన్నుల దొడ్డురకం వడ్లు) టన్నుల ధాన్యాన్ని కొనాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు కేవలం 248 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. వరి కోతలు ప్రారంభమై 15 రోజులు గడిచినా టార్గెట్‌కు దరిదాపుల్లోకి కూడా రాలేదు. కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండడంతో లక్ష్యం పూర్తవ్వడం కష్టంగానే కనిపిస్తున్నది.

### సన్నాల కొనుగోలుకు కొర్రీలు..

సన్న రకం వడ్ల కొనుగోలుపై అధికారులు అనేక కొర్రీలు పెడుతుండటంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లడంలేదు. సన్నరకానికి క్వింటాల్‌కు 500 బోనస్ ఇవ్వాల్సి ఉన్నది. అయితే అధికారులు అనేక ఆంక్షలు విధిస్తున్న నేపథ్యంలో చాలామంది దళారులు, వ్యాపారులకు తమ ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపో తున్నారు.

### 29 కేంద్రాలే ప్రారంభం..

జిల్లాలో ఐకేపీ, డీసీఎంఎస్, సహకార సంఘాల ద్వారా 45 కొనుగోలు కేంద్రాల ను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 29 మాత్రమే ప్రారంభించారు. డిమాండ్ అధికంగా ఉన్న మంచాల, యాచారం, కందుకూరు, షాద్‌నగర్, ఆమనగల్లు వంటి ప్రాంతాల్లో అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

### కొనుగోళ్లు వేగవంతం చేస్తాం



జిల్లావ్యాప్తంగా వరి కోతలు ముమ్మరమైన నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తాం. ఇప్పటికే 29 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు ప్రారంభించాం. డిమాండ్‌ను బట్టి మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. అలాగే, సీఎంఆర్ మిల్లర్ల ద్వారా కూడా కొనుగోళ్లు జరిగేలా చూస్తాం. సన్న రకం వడ్లకు ఎలాంటి ఆంక్షలు లేకుండా బోనస్‌ను రైతులకు అందేలా చూస్తాం.

–గోపీకృష్ణ, డీఎం సివిల్‌సప్లయ్

### ఇంకా కల్లాల్లోనే ధాన్యం..



జిల్లాలో కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది రైతుల వడ్లు ఇంకా కల్లాల్లోనే ఉన్నాయి. అధికారులు కొనుగోళ్లను ముమ్మరం చేసి అన్నదాతలను ఆదుకోవాలి. ఇప్పటికే చాలామంది దళారులు, వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోయారు.

–సత్తు వెంకటరమణారెడ్డి



రోటిబండ తండాలో ఆందోళనతో కూర్చున్న గిరిజన మహిళలు

## గిరిజనులపై కేసులు ఎత్తివేయాలి..

### లేకుంటే 2000 మంది గిరిజనులతో కొడంగల్‌లో ధర్నా నిర్వహిస్తాం

### మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, నవంబర్ 16 : కొడంగల్ సెగ్మెంట్‌లోని లగచర్లలో అమాయక గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని లేని పక్షంలో 2,000 మంది గిరిజనులతో కలిసి కొడంగల్ ప్రధాన చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తామని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ హెచ్చరించారు. శనివారం ఆయన మండల కేంద్రంలో మండలానికి చెందిన గిరిజన నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం లంబాడీలను వేధిస్తున్నదని మండిపడ్డారు. లగచర్లలో గిరిజనుల భూములను ప్రభుత్వం లాక్కోవడానికి యత్నించడంతో రైతులు ఎదురు తిరిగారని.. వారిపై కక్షపూరితంగా వ్యవహరించి జైలుకు పంపించడం తగదన్నారు. లంబాడీలపై మోపిన కేసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేకపోతే కల్వకుర్తి నియోజకవర్గం నుంచి 2,000 మంది గిరిజనులతో వెళ్లి కొడంగల్‌లో మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నమ్మి ఓట్లేస్తే జైలుకు పంపించడం రేవంత్‌రెడ్డికి తగునా అని ప్రశ్నించారు. లగచర్లలో జరిగిన ఘటన అధికారులపై దాడి కాదని, అది కాంగ్రెస్ సర్కారుపై గిరిజనులు చేసిన తిరుగుబాటు అని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, లోకేశ్‌నాయక్, ఛత్రూనాయక్, మాజీ ఉప సర్పంచ్‌లు పాండూనాయక్, రమణానాయక్, నాయకులు శ్రీనూనాయక్, సోమ్లానాయక్, భీమన్, అంజీనాయక్, జగన్, బీచ్యానాయక్, రాములు, పాండు, కోట్యా, రమేశ్, రవి, గణేశ్, భీమ్లా, ధర్మా, రాజశేఖర్, రాజు, శ్రీను, శ్రీకాంత్, తిరుపతి, వినోద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, పాల్గొన్న గిరిజన నాయకులు